

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్

పెద్ద అంబర్‌పేట పరిధిలో బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలింది. పార్టీ పట్టణ అధ్యక్షుడు సిద్ధంకి కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. 10లో▸



కేసీఆర్ బీమాతో ధీమా

కేసీఆర్ బీమాతో పేదలకు ధీమా కలుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. 10లో▸



ప్రజలచూపు బీఆర్‌ఎస్ వైపు

తెలంగాణ ప్రజల చూపంతా బీఆర్‌ఎస్ వైపే ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

మంచాలలో రూ.7.50 లక్షలు స్వాధీనం

మంచాల: ఎన్నికల నేపథ్యంలో ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మండల పరిధిలోని జాపాల గ్రామానికి చెందిన సంజీవ రెడ్డి ఓ స్కూటీలో రూ.7.50 లక్షలు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు. నగదు మొత్తాన్ని ఆర్డీఓకు అప్పగించినట్లు ఎస్ఐ రవి నాయక్ తెలిపారు.

రూ.2 లక్షల నగదు పట్టివేత

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్ పహాడ్ ముఖ్య కూడలిలో ఓ వ్యక్తివద్ద పోలీసులు రూ.2 లక్షల నగదు పట్టుకున్నారు. కొందుర్గు గ్రామానికి చెందిన తాళ్లపల్లి శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం కొందుర్గు నుంచి పరిగి వైపు కారులో వెళ్తుండగా లాల్‌పహాడ్ చెక్ పోస్టు వద్ద తనిఖీ చేయగా రూ.2 లక్షలు లభించినట్లు ఎస్ఐ సక్రమ్ తెలిపారు.

ఓయూ స్నాతకోత్సవానికి వేళాయె

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే స్నాతకోత్సవానికి సర్వం సిద్ధమైంది. పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టాలు అందుకోనున్న 979 మంది అభ్యర్థులకు, 57 బంగారు పతకాలు అందుకునే విద్యార్థులతో పాటు అతిథులు, సిబ్బంది, ఇతరులకు ఆడిటోరియంలో 1000కి పైగా సీట్లను ఏర్పాటు చేశారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు, వారితో పాటు మరొకరికి ప్రవేశం కల్పించనున్నారు. ఎంట్రీ పాస్ ఉన్న అభ్యర్థులకు మాత్రమే ఆడిటోరియంలోకి ప్రవేశం ఉంటుందని, అభ్యర్థులు గంట ముందు చేరుకొని కేటాయించిన సీట్లలో కూర్చోవాలని ఎగ్జామినేషన్ కంట్రోల్ ప్రొ.రాములు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎగ్జామినేషన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే 83వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ అందుకోనున్న ప్రముఖులు

ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీలను 979 మంది అభ్యర్థులు అందుకోనున్నారు. అందులో మహిళలు 371 మంది కాగా, పురుషులు 608 ఉన్నారు. వన్‌టైం చాన్స్‌తో యూనివర్సిటీ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడాదిలో 1325 పీహెచ్‌డీ పూర్తి చేయగా అందులో 979 మంది అభ్యర్థులు కాన్వొకేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఐఏఎస్, ఐపీఎస్, అధ్యాపకులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు ఆఫీసర్లు, వివిధ శాఖల్లో ఉన్నత అధికారులతో పాటు ఎమ్మెల్యేలు సీతక్క, బాల్క సుమన్, గువ్వల బాలరాజు ఉన్నారు. పూర్తిగా కళ్లు కనిపించని దివ్యాంగుడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) అనిల్‌కుమార్ న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకోనుండటం విశేషం.

శంతన్ నారాయణ్‌తో ఇంట్రాక్షన్

స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ పూర్వవిద్యార్థి, అమెరికాకు చెందిన అడోబీ కంపెనీ సీఈఓ పద్మశ్రీ శంతన్ నారాయణ్‌తో విద్యార్థులకు ఇంట్రాక్షన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేశ్ తెలిపారు.

సోషల్.. హవా

సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకుంటున్న పార్టీలు



- ఎన్నికల వేళ విరివిగా సోషల్ మీడియా వినియోగం
- మేనిఫెస్టో ప్రజల్లోకి వెళ్లేలా పోస్టులు
- డిజిటల్ సంస్థలతో ఒప్పందాలు
- విమర్శలు, ప్రతివిమర్శలకు ప్రత్యేక కంటెంట్
- రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్న పార్టీలు

షాబాద్: ఒకప్పుడు ఎన్నికలు వస్తే గోడలపై రాతలు.. కరపత్రాలు.. వాల్‌పోస్టర్లు.. సభలు.. సమావేశాలతో ప్రచారం నిర్వహించేవారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. సమాచార సాంకేతిక విప్లవం అన్ని రంగాలతో పాటే రాజకీయాల్లోనూ మార్పు తెచ్చింది. ఎన్నికల ప్రచారానికి సోషల్ మీడియాను నేతలు తెగ వాడేస్తున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, వాట్సాప్, యూట్యూబ్‌తో పాటు పలు రకాల సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను వినియోగిస్తున్నారు. సోషల్ మీడియాలో ఆయా పార్టీల మేనిఫెస్టోలతో పాటు, పలు రకాల వీడియోలు, ఫొటోలు, మీమ్స్ షేర్ చేస్తున్నారు. యువత ఓట్లు ఎక్కువగా ఉండటంతో మేనిఫెస్టోతో పాటు రోజువారీ కార్యక్రమాలను పోస్టు చేసి వారికి చేరువయ్యేలా చూస్తున్నారు. ఇందుకు ఆయా పార్టీలు సోషల్ మీడియా కన్వీనర్లను సైతం నియమించుకోవడం విశేషం.

డిజిటల్ సంస్థలతో ఒప్పందం..

సోషల్ మీడియాలో ఆయా పార్టీలు ప్రచారం నిర్వహించేందుకు ప్రత్యేకంగా డిజిటల్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇందుకు పార్టీలు రూ.లక్షల్లో చెల్లిస్తున్నాయి. ఇక డిజిటల్ సంస్థలు సోషల్ మీడియా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగాం, టెలిగ్రాం, యూట్యూబ్‌లో పార్టీల పేరిట వందల సంఖ్యలో అకౌంట్లు క్రియేట్ చేస్తున్నాయి. వీటి ద్వారా యాడ్స్‌తో పాటు ఆయా సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలలో లైక్‌లు, కామెంట్లు పెట్టేందుకు వందల సంఖ్యలో ఫేక్ అకౌంట్లు తయారు చేస్తున్నారు. వీటి ద్వారా పార్టీల మేనిఫెస్టోలు, వీడియోలు, ఫొటోలను ఎక్కువ మొత్తంలో ప్రజలకు చేరువయ్యేందుకు డిజిటల్ మీడియా సంస్థలు పనిచేస్తున్నాయి. అభ్యర్థులు, ఆశావహులు కూడా డిజిటల్ మీడియా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. పార్టీల పథకాలతో పాటు రోజువారీ ప్రచారాన్ని సోషల్‌మీడియాలో పోస్టు చేసి జనాలకు చేరువ చేసే ప్రయత్నం చేస్తున్నారు. వాట్సాప్ చానళ్లు, గ్రూపులను క్రియేట్ చేసి అందులో పోస్టులు పెడుతున్నారు. ఒక్క పోస్టు పెడితే లక్షల మంది చూస్తుండటంతో సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం అభ్యర్థులు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

ప్రత్యేక కంటెంట్‌తో..

ఇక డిజిటల్ మీడియా సంస్థలు తాము ఒప్పందం కుదుర్చుకున్న పార్టీల కోసం, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల కోసం పార్టీలకు అనుకూలమైన, ప్రజలకు చేరువయ్యే అంశాలతో కూడిన ప్రత్యేక కంటెంట్ తయారు చేస్తున్నాయి. ఈ కంటెంట్‌ను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువచేస్తున్నాయి. పోస్టులను ఎక్కువ మందికి చేరువచేయడానికి ఆయా సోషల్ మీడియా సంస్థలకు డబ్బులు చెల్లించి, లోకేషన్‌తో పాటు ఆయా వయస్సుల ఓటర్లకు చేరువయ్యేలా చూస్తున్నారు. ప్రత్యేక కంటెంట్ కోసం డిజిటల్ సంస్థలకు పార్టీలు భారీగా డబ్బులు ఇస్తున్నాయి. కంటెంట్ రాసిచ్చే వారిని డిజిటల్ మీడియా సంస్థలే భారీగా రిక్రూట్ చేసుకుంటున్నాయి.

నిర్ధారించుకోవాలి

ఇక ఆయా పార్టీలు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న కంటెంట్‌ను చూసి ఏది నిజమో..ఏది అబద్ధమో తెలియని పరిస్థితిలో ఓటర్లున్నారు. ఓటర్లు కూడా సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలు, పోస్టులను నిర్ధారించుకోవడం అతిముఖ్యం. అలా నిర్ధారించుకున్న తర్వాతే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులపై ఇబ్బంది కలిగితే ఫిర్యాదు చేయొచ్చని సూచిస్తున్నారు.

అడ్మిన్లు.. జర జాగ్రత్త

పార్టీల నేతలు ఏర్పాటు చేసిన సోషల్ మీడియా గ్రూప్‌ల్లో అభ్యంతరకమైన పోస్టులు పెడితే ఆ పార్టీల నాయకులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రత్యేకమైన గ్రూప్‌లో ఇతర పార్టీలను విమర్శిస్తూ.. మనోభావాలను దెబ్బ తీసేలా పోస్టులు పెడితే అడ్మిన్లకు ఇబ్బంది కలుగక మానదు. ప్రస్తుతం కొన్ని గ్రూపుల్లో అన్ని పార్టీల నాయకులుంటారు. ఆ గ్రూపుల్లో ఒక పార్టీ పెట్టిన పోస్టుకు, ఆయా పార్టీల నాయకులు విమర్శలు చేస్తుంటారు. దీంతో గ్రూపులో విపరీతమైన చర్చలు జరిగి గొడవలకు దారితీసే అవకాశం ఉంటుంది. ఏదైనా జరిగితే ఆ గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

చివరి దాకా బీఫాం కోసం కొట్లాడతా

- కట్టె కాలే వరకు కాంగ్రెస్‌లోనే ఉంటా
- బడంగ్‌పేట మేయర్ పారిజాత



సమావేశంలో మాట్లాడుతున్న చిగురింత పారిజాత

మీర్‌పేట: బీఫాం కోసం చివరి వరకు అధిష్టానంతో కొట్లాడతానని, కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలోని గడపగడపకూ తిరిగి పార్టీని బలోపేతం చేశానని చెప్పారు. పార్టీ నిర్ణయం తనను, కార్యకర్తలను ఎంతో బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని హైకమాండ్ వద్ద తన పేరు ఖరారైనప్పటికీ మన బలం చూసి ఇతరులు భయపడి టికెట్ రాకుండా కుట్రలు చేశారని ఆరోపించారు. చివరివరకు అధిష్టానం తనను గుర్తించి న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీని వ్యక్తులు మోసం చేశారు తప్ప పార్టీ ఎప్పుడు మోసం చేయలేదన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కానుకగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. 20 ఏళ్ల నుంచి ప్రజాక్షేత్రంలోనే ఉన్నానని, కాంగ్రెస్ పార్టీ కన్న తల్లిలాంటిదని, కట్టె కాలే వరకు కాంగ్రెస్‌లోనే ఉంటానని పారిజాత స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, డివిజన్‌లు, మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధిష్టానం పునరాలోచన చేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

- కష్టకాలంలో కాంగ్రెస్‌ను కాపాడుకున్నాం
- పార్టీ మహేశ్వరం సీనియర్ నేత దేపా భాస్కర్ రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం అసెంబ్లీ అభ్యర్థిత్వంపై అధిష్టానం పునరాలోచన చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దేపా భాస్కర్ రెడ్డి కోరారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లుగా నియోజకవర్గంలో పార్టీని భుజాలపై మోస్తున్న తనలాంటి వారిని కాకుండా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు అనే నెపంతో కిచ్చన్న గారి లక్ష్మారెడ్డికి టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం నిరంతరం పని చేస్తుంటే గత ఎన్నికల్లో సబితారెడ్డికి టికెట్ కేటాయించారని, అప్పుడు ఆమె గెలుపును తమ భుజస్కంధాలపై వేసుకొని గెలిపిస్తే అందరినీ మోసం చేసి అధికార పార్టీలో చేరారని గుర్తు చేశారు. అయినా నిరాశ చెందక పార్టీ కోసం నిరంతరం కష్ట పడి నియోజకవర్గ పరిధిలో జరిగిన సర్పంచి, ఎంపీటీసీ, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకున్నామని అన్నారు. తనతోపాటు టికెట్ ఆశించిన నేతల్లో ఎవరికి కేటాయించినా పార్టీని గెలిపించుకునే వాళ్లమన్నారు. నియోజకవర్గంలో 90 శాతం కార్యకర్తలు తనకే టికెట్ కేటాయించాలని కోరుతున్నారని, ఇప్పటికీ సమయం మించిపోలేదని అధిష్టానం పునరాలోచించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, రామకృష్ణ పురం డివిజన్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేశ్ నేత, మహేశ్వరం మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామిడి గోపాల్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి

- తెలంగాణ ప్రజలను మోసం చేసిన నాయకుడు కేసీఆర్
- హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్




ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న సిద్దాల దశరథ తదితరులు

మీర్‌పేట: తెలంగాణ ప్రజలను మోసం చేసిన నాయకుడు కేసీఆర్ అని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ విమర్శించారు. కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడలో జరిగిన కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు, జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథతో పాటు ఆయన మద్దతుదారులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే ప్రజల బతుకులు మారతాయని నాడు కేసీఆర్ చెప్పారని, అధికారంలోకి వచ్చి పదేళ్లు అవుతున్నా ఎవరి బతుకులు మారలేదన్నారు. ఎవరు చెప్పేది అబద్ధం, నిజం ఏదో తర్కించగల సత్తా, శక్తి ప్రజలకు ఉంటుందని, ఆలోచించి ఓటు వేయాలన్నారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం 4 కోట్ల మందికి ఇళ్లు కట్టించారని, మరి రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. నిరుద్యోగులు సంవత్సరాల పాటు రేయింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాస్తే ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేపర్ లీక్‌లు అయితే చేసేది లేక ఎంతో మంది బలవన్మరణాలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. దీనికి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమని ధ్వజమెత్తారు. దేశంలోనే హైదరాబాద్‌లో ఎక్కువగా నిరుద్యోగ యువత ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్‌లు ఇచ్చి ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ లిక్కర్‌కు, మత్తు పదార్థాలకు అడ్డాగా మారిందన్నారు. ఆయనకు సొంత ప్రయోజనాలే ముఖ్యమని, ప్రజల బాగోగులు అక్కర్లేదన్నారు. బీజేపీకి ఓటు వేస్తే పేద ప్రజలకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. స్థానికుడు, మీలో ఒకడైన అందెల శ్రీరాములుకు ఓటు వేసి అసెంబ్లీకి పంపాలని ఓటర్లను కోరారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన దమ్మున్న పార్టీ ఒక్క బీజేపీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. మీర్‌పేట పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ కార్యదర్శి పాపయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగయ్య యాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, సోమేశ్వర్, గాజుల మధు పాల్గొన్నారు.

మరోసారి.. మంచిరెడ్డి వర్సెస్ మల్‌రెడ్డి

- ఇబ్రహీంపట్నం బరిలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి
- పార్టీలు మారుతున్నా ప్రత్యర్థులు వారే..



మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్: మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి సోదరులు 20 ఏళ్లుగా రాజకీయంగా పోటీ పడుతూ వస్తున్నారు. ఇద్దరూ ఏ పార్టీలో ఉన్నా పోటీ మాత్రం వారి మధ్యే ఉంటోంది. ఇద్దరిలో ఒక్కసారి మల్‌రెడ్డి గెలవగా మూడుసార్లు మంచిరెడ్డి విజయం సాధించారు. మలక్‌పేట్ నియోజకవర్గం నుంచి వారి మధ్య పోటీ మొదలైంది. గతంలో నాలుగు పర్యాయాలు పోటీ పడిన వారు తాజాగా మరోసారి ఇబ్రహీంపట్నం బరిలో నిలిచారు. 2004లో మలక్‌పేట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి పోటీ చేయగా టీడీపీ తరఫున మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత వీరి పోటీ ఇబ్రహీంపట్నానికి మారింది. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పోటీ చేయగా మల్‌రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో మంచిరెడ్డి మల్‌రెడ్డిపై పైచేయి సాధించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మరోసారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయగా ఈ ఎన్నికల్లో మల్‌రెడ్డి రంగారెడ్డికి కాంగ్రెస్ టికెట్ రాలేదు. ఆయన మహేశ్వరం నుంచి పోటీ చేయగా ఆయన సోదరుడు రాంరెడ్డి ఇబ్రహీంపట్నం నుంచి ఇండిపెండెంట్‌గా మంచిరెడ్డిపై పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో మంచిరెడ్డి గెలుపొందగా మల్‌రెడ్డి రాంరెడ్డి రెండో స్థానంలో నిలిచారు. అనంతరం రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి టీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో వచ్చిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పోటీ చేయగా కాంగ్రెస్, టీడీపీ పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని టీడీపీకి కేటాయించారు. దీంతో మల్‌రెడ్డి రంగారెడ్డి బీఎస్పీ నుంచి బరిలో నిలిచారు. మిత్రపక్షమైన టీడీపీని కాదని కాంగ్రెస్ శ్రేణులు బీఎస్పీకి మద్దతిచ్చారు. ఈ ఎన్నికల్లో గట్టి పోటీనిచ్చిన మల్‌రెడ్డి రంగారెడ్డి సుమారు 376 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. తాజాగా మంచిరెడ్డి, మల్‌రెడ్డి మధ్య ఐదోసారి పోటీ జరుగుతోంది. ఇద్దరూ ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ పడుతున్నారు. రెండు పర్యాయాలు కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో సొంత బలంతో పోటీ చేసిన మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీలో ఉండడంతో ఇద్దరి మధ్య పోటీ రసవత్తరంగా మారింది.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించం

- పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి
- ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలి
- నిఘా బృందాలకు కలెక్టర్ భారతి హోళికేరి దిశానిర్దేశం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. స్టాటిస్టిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర నిఘా బృందాల అధికారులకు ఆదివారం ఖైరతాబాద్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల వ్యయం విషయంలో ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందని.. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను విధిగా పాటించాలని, అన్ని పార్టీలు, అభ్యర్థులతో నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

విధినిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిఘా బృందాల దృష్టిని మళ్లించేందుకు పలువురు చేసే తప్పుడు ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిఘా బృందాలు అనునిత్యం నిఘా ఉంచాలని, ఈ మేరకు పూర్తి స్థాయిలో బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వారికి సమకూర్చిన వాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన పీటీజీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా నిఘా బృందాల పని తీరును కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయంలోనూ లైవ్ ఫీడింగ్ పరిశీలన ఉం టుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టుల వద్ద పీటీజీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు అనవసర ఇబ్బందులు ఏర్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని, నగదును జప్తు చేసిన సందర్భాల్లో తగు రీతిలో పంచనామా నిర్వహించి తప్పనిసరిగా రసీదులు అందించాలని ఆదేశించారు. తగిన ఆధారాలను చూపించి నగదును విడిపించుకునే వెసులుబాటు ఉంది అనే విషయాన్ని వివరించాలని, జిల్లా స్థాయిలో జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ గురించి తెలియజేయాలని సూచించారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన రేట్ కార్డును అనుసరిస్తూ లెక్కింపు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని, ఎన్నికల నియమావళిని తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్, జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, నోడల్ అధికారులు వెంకట్ రెడ్డి, ధాత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

కలెక్టర్ భారతి హోళికేరి ఆదివారం ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గుర్తించిన అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను (403 404 , 405) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని నివాసితులతో మాట్లాడారు. ఎలాంటి ఆందోళన చెందకుండా, ప్రశాంతంగా.. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట హయత్‌నగర్ ఎఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్, ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ, ఎస్‌హెచ్ఓ, సంబంధిత అధికారులు ఉన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు

- సమస్యాత్మక కేంద్రాలను పరిశీలించిన సైబరాబాద్ సీపీ

సాక్షి, సిటీబ్యూరో: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని అన్ని రకాల పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. ఆదివారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అత్తాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నానక్‌రామ్‌గూడ ఖానామెట్, మాదాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ ప్రాంతాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలీసులు, ప్రజలకు సూచనలు చేశారు. అత్తాపూర్‌లో సిక్కు కమ్యూనిటీతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. సీపీ వెంట మాదాపూర్ డీసీపీ సందీప్, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మహిళల ర్యాలీ



ఇబ్రహీంపట్నంలో రాష్ట్ర సేవికా సమితి మహిళల ర్యాలీ

ఇబ్రహీంపట్నం: విజయదశమి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర సేవికా సమితి భాగ్యనగర్ ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నంలో సదస్సు నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా, పాత బస్టాండ్, మహంకాళి నగర్ మీదుగా మహిళల ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవికా సమితి తెలంగాణ ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధ, భాగ్యనగర్ విభాగ్ కార్యవాహిక ప్రసన్నలక్ష్మి, సికింద్రాబాద్ విభాగ్ కార్యవాహిక విజయలక్ష్మి, ముఖ్య అతిథిగా డా. స్మితరామరాజులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్



సిద్ధంకి కృష్ణారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వంశీచంద్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి

కారు దిగి కాంగ్రెస్‌లో చేరిన కృష్ణారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్ద అంబర్‌పేట మున్సిపల్ పరిధిలో బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. పార్టీ కార్యక్రమాలకు కొన్ని రోజులుగా దూరంగా ఉంటున్న బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ సిద్ధంకి కృష్ణారెడ్డి అనుకున్నట్లుగానే ఆదివారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఉదయం సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి సిద్ధంకి నివాసానికి వచ్చిన ఆయన చర్చలు జరిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సిద్ధంకి కృష్ణారెడ్డితో పాటుగా పార్టీలో చేరిన సహకార సంఘం డైరెక్టర్ గంటా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సిద్ధంకి రాజిరెడ్డి, నాయకులు సిద్ధంకి జగన్మోహన్‌రెడ్డి, పాలడుగు నాగార్జున తదితరులకు వంశీచంద్‌రెడ్డి, మల్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షు డు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, రాజేందర్ ముదిరాజ్, జయశ్రీరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బుయ్య కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే రాజ్యాధికారం

బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు సురేశ్



సురేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఐకమత్యంతోనే రాజ్యాధికారం సాధ్యమని బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దొంతుల సురేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించడం హర్షనీయమన్నారు. బీహార్‌లో మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలోనూ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానంతరం ప్రధాని మోదీ బీసీ కమిషన్‌ను రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేయడం శ్లాఘనీయమన్నారు. రాష్ట్రంలోని ఏ ప్రధాన రాజకీయ పార్టీలు బీసీల గురించి ఆలోచించే స్థితిలో లేవని విమర్శించారు. బీజేపీ అధిష్టానం ప్రకటించిన తొలి జాబితాలో అత్యధిక అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించడం శుభపరిణామని అన్నారు. మిగిలిన పార్టీలు సైతం బీసీలకు బీఫాంలు ఇచ్చి సీఎంని చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవయ్య, రాములు, రోమియో రమేశ్, వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటేసి ఆశీర్వదించండి

పార్టీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

నందిగామ: అవినీతిమయమైన బీఆర్‌ఎస్‌ను గద్దె దించేందుకు బీజేపీకి ఓటేయాలని పార్టీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లి, మజీద్ మామిడిపల్లి, శ్రీనివాసులు గూడ గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు చేగు సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం వెనుకబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత విద్య, వైద్యం కోసం కమలం గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా రెడ్డి, ప్రదీప్, మోహన్ సింగ్, వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, నర్సింహ యాదవ్, నరేందర్ రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్ రెడ్డి, జగన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ఇంద్రాసేన రెడ్డి, కృష్ణయ్య, అరవింద్, అనిల్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేశ్ ముదిరాజ్

తలకొండపల్లి: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేశ్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు నగరంలోని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నివాసంలో జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. అనంతరం రవికాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. నరేశ్ దశాబ్ద కాలంగా పార్టీ పటిష్టతకు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ జిల్లా కమిటీలో చోటు కల్పించిందని వివరించారు. అనంతరం నరేశ్ మాట్లాడుతూ.. పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, నాగర్‌కర్నూల్ జిల్లా వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్ రెడ్డి, సీనియర్ నాయకులు సుంకి రాఘవేందర్‌రెడ్డి, గుజ్జల మహేశ్‌కు, యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి తాలూకా అనిల్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆశావహులకు మొండి 'చేయి'

కాంగ్రెస్ విడుదల చేసిన రెండో లిస్టులో 'పట్నం' అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డిని ప్రకటించింది. దీంతో ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించేవారు.. టికెట్ ఆశించిన నేతలు అసంతృప్తిగా ఉన్నారు. పార్టీ మారాలా..? రెబల్స్‌గా బరిలో ఉండాలా..? అనే నిర్ణయం కోసం తమ అనుచరులతో సమావేశమవుతున్నారు.

కాంగ్రెస్ టికెట్ దక్కక నేతల అంతర్మథనం
- అనుచరులతో సమాలోచనలు



ఇబ్రహీంపట్నం: కిం...కర్తవ్యం.. ఇప్పుడేం చేద్దాం అనే ఆలోచనల్లో పడ్డారు టికెట్ దక్కని కాంగ్రెస్ ఆశావహులు. శుక్రవారం విడుదల చేసిన రెండో లిస్టులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి పేరును ఖరారు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మల్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న వారు, పార్టీ టికెట్ ఆశించిన వారు.. అసంతృప్తులు ఇప్పుడేం చేయాలని సమాలోచనలు చేస్తున్నారు.

ఆశించి భంగపడిన నేతలు

మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు దండెం రాంరెడ్డి, బీసీ వాదంతో ఈసీ శేఖర్‌గౌడ్ ఇబ్రహీంపట్నం టికెట్ కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేసి భంగపడ్డారు. ఆది నుంచి మల్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని దండెం రాంరెడ్డి, మర్రి నిరంజన్‌రెడ్డి వ్యతిరేకిస్తూ వస్తున్నారు. వీరు అధిష్టానం నిర్ణయాన్ని శిరసావహించి మద్దతిస్తారా..? లేక మరో దారి చూసుకుంటారా..? రెబల్స్‌గా బరిలో ఉంటారా అని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

గ్రూపు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్

'పట్నం' కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు కొత్తేమీకాదు. తొలినాళ్ల నుంచే వాటికి పెట్టింది పేరు. 1982లో ఏజీ కృష్ణ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఆయన వ్యతిరేకిస్తూ కొంతమంది గ్రూపు రాజకీయాలకు తెరలేపారు. తరాలు మారుతున్నా గ్రూపు రాజకీయాలకు కనుమరుగవ్వడం లేదు. పార్టీ వీటికి అడ్డుకట్ట వేయకపోవడంతో 1985 నుంచి ప్రతీ ఎన్నికలో ఈ స్థానాన్ని కోల్పోవాల్సి వస్తోంది.

చివరి వరకు పోరాటం

ఇళ్లు అలకగానే పండగ కాదు.. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన మాత్రాన జరిగిదేమీ లేదు. ఆయనకు పార్టీ బీఫాం రాకుండా పోరాటం చేద్దామనే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు శనివారం దండెం రాంరెడ్డి పెద్ద అంబర్‌పేట్‌లో తన ముఖ్య అనుచరులతో చర్చించినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

నిరంజన్‌రెడ్డి నిర్ణయంపై ఉత్కంఠ

ఢిల్లీకి వెళ్లిన మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి శనివారం వచ్చినట్లు సమాచారం. ముందు నుంచి తనకే టికెట్ వస్తుందని ఆశతో ఉన్న ఆయనకు నిరాశే ఎదురైంది. ఆయన నిర్ణయంపై అనుచరులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే ఆయన అనుచరన గనంతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

అసంతృప్తిని చల్లార్చేదెవరు..?

కాంగ్రెస్‌లో రేకెత్తిన అసంతృప్తి జ్వాలలను చల్లార్చేవారెవరు..? అభ్యర్థి గెలుపునకు సహకరించేది ఎవరు అనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా మొదలయింది. అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది చెప్పలేక పోతున్నారు. ఈ వివాదం సామరస్యంగా సద్దుమనుగుతుందా..? లేక కాంగ్రెస్ పుట్టి ముంచే ప్రమాదమేనైనా ఉందా అనేది వేయి చూడాల్సిందేనని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

'దండెం' దారెటు?



శనివారం అనుచరులతో కలిసి అభివాదం చేస్తున్న రాంరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో తానే ఉంటానని ధీమాతో ఉన్న పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దండెం రాంరెడ్డికి చివరికి నిరాశే ఎదురైంది. కాంగ్రెస్ ప్రకటించిన మొదటి జాబితాలో పేరు రానప్పటికీ రెండవ జాబితాలో తన పేరు తప్పకుండా వస్తుందనుకున్న ఆయన తన అనుచరులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తుండడంతో పాటు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రెండవ జాబితాలో అధిష్టానం మల్‌రెడ్డిరంగారెడ్డి పేరును ప్రకటించింది. దీంతో ఆయన శనివారం తన నివాసంలో అనుచరులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. పట్నం నుంచి కాంగ్రెస్ రెబల్‌గా పోటీలో ఉంటారనే సంకేతాలిస్తున్నారు.

బీఆర్‌ఎస్ అంటేనే నమ్మకం

షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



ఎలికట్టలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: సీఎం కేసీఆర్ అంటేనే ప్రజలకు నమ్మకమని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, పీర్లగూడ, దొంతికుంట తండా, కందివనం, ఎల్లంపల్లి, మొగిలిగిద్ద, రంగంపల్లి, రాసుమల్లగూడ, నాగులపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అరవై ఏళ్ల పాలనలో చేసిందేమీ లేదని విమర్శించారు. తండాలను ప్రత్యేక పంచాయతీలు చేసి అభివృద్ధి చేసిన ప్రధాతయని కొనియాడారు. సంక్షేమ ఫలాలు ఇంటింటికి ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. హాజీపల్లి, పెద్ద ఎల్కిచర్ల, చాకలిదానిగుట్ట, ఎలికట్ట గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

స్థానికేతరులకు చోటు లేదు




ముచ్చర్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కేఎంఆర్

- మహేశ్వరం నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి మనోహర్‌రెడ్డి
- ముచ్చర్లలో ఎన్నికల ప్రచారం ప్రారంభం

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గంలో స్థానికేతరులకు స్థానం లేదని స్వతంత్ర అభ్యర్థి, కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ముచ్చర్లలో ఆయన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే హామీలన్నీ నెరవేరుస్తానన్నారు. ఫార్మాసిటీ భూ నిర్వాసితులకు న్యాయం చేసేంత వరకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతీ పేదకు 60 ఇంటి స్థలం ఇస్తానన్నారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నందున ప్రతీ ఒక్కరు తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భిక్షపతి, నాయకులు రాజేందర్, లక్ష్మయ్య, రాఘవేందర్, నాగార్జున, దశరథ, కుమార్, రవి, మహేందర్, శ్రీకాంత్, కృష్ణ, సత్తయ్య, రాజయ్య, రాములు, లక్ష్మయ్య, సంతోశ్‌ముదిరాజ్, పవన్, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



కృష్ణసాయి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: కళాశాలకు వెళ్లిన డిప్లొమా విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మన్న కృష్ణసాయి మండల పరిధిలోని పిగ్లీపూర్ రెవెన్యూ పరిధి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల హెచ్‌ఓడీ ఈనెల 17న విద్యార్థి తండ్రి అమరేశ్వరరావును కళాశాలకు పిలిపించాడు. హెచ్‌ఓడీ కృష్ణసాయి తండ్రితో మాట్లాడుతుండగా బయటకు వచ్చిన విద్యార్థి తిరిగి కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అమరేశ్వరరావు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్‌ముదిరాజ్

మైలార్‌దేవ్‌పల్లి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పేదల ఆకలి, సంక్షేమం, అభివృద్ధి చూసిందే కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మైలార్‌దేవ్‌పల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వంలో పేదలకు దక్కింది ఏమి లేదన్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలను తీర్చాలని, రాష్ట్రాన్ని దేశంలోనే పేరెన్నికగన్న రాష్ట్రంగా తీర్చిదిద్ది ప్రజల తెలంగాణ చేయాలనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం ఇచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను బయటకు తీయటంతో పాటు బంగారు తెలంగాణ అంటే ఏమిటో చేసి చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ్, బి బ్లాక్ అధ్యక్షుడు ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ బీమాతో ధీమా



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- మక్తమాధారం, న్యామతాపూర్‌లో విస్తృత ప్రచారం

కడ్తాల్: కేసీఆర్ బీమాతో పేదలకు ధీమా కలుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని న్యామతాపూర్, మక్తమాధారం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. బీఆర్‌ఎస్ అధికారం చేపట్టిన వెంటనే ఆసరా పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లు, రైతు బంధు సాయం, పేద మహిళలకు ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. ప్రజాసంక్షేమం కోసం పాటుపడే బీఆర్‌ఎస్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వాదించాలని, సీఎం కేసీఆర్‌ను ముచ్చటగా మూడో సారి సీఎంను చేయాలని కోరారు. అనంతర వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్, కల్వకుర్తి బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి గోలి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, సులోచన సాయిలు, హరిచంద్‌నాయక్, కమ్లీబీచ్యానాయక్, యాదయ్య, తులసీరాం ,సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ సభ్యులు మంజుల, నాయకులు సాయిలు, కృష్ణ, వెంకటయ్య, కృష్ణ, వీరేశం, శ్రీకాంత్, శ్రీశైలం, నరేశ్, రామకృష్ణ తదితరులున్నారు.

ప్రజలచూపు 'కారు' వైపే

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: తెలంగాణ ప్రజల చూపంతా బీఆర్‌ఎస్ వైపే ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లికి చెందిన వివిధ పార్టీల యువకులు ఆదివారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే యాదయ్య వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలంతా ఆకర్షితులవుతున్నారన్నారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని విశ్వసిస్తున్నారని.. అందుకే వలసలు పెరిగాయన్నారు. పార్టీలో చేరినవారిలో ప్రవీణ్, దశరథ్, మధుకర్, మాణిక్యం, శంకర్, దయాకర్, కృష్ణ, రాజు, శ్రీనివాస్, వెంకటేశ్, శ్రీకాంత్, నరేశ్, శ్రీహరి తదితరులున్నారు. ఈ కార్యక్రమంలోపీఏసీఎస్ మాజీ చైర్మన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'కారు'కు ఓటేద్దాం

మొయినాబాద్‌రూరల్: కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుందామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అధ్యక్షతన ఎన్నికల ప్రచార సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనను అధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌ను మూడో సారి సీఎంను చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని చెప్పారు. అనంతరం కుమ్మర సంఘం అధ్యక్షుడు దర్శన్ ఆధ్వర్యంలో గ్రామంలోని కాంగ్రెస్, బీజేపీ, టీడీపీకి చెందిన 200మంది నాయకులు,యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్, ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, గ్రామ అధ్యక్షుడు రాజు, వార్డు సభ్యులు యాదయ్య, శ్రీహరియాదవ్, నర్సింహగౌడ్, స్వప్న, షాబాద్ మధు, విఠల్, పరమేశ్, కాళిదాసు, మల్లేశ్‌యాదవ్, గిరి, కుమ్మరి సంఘం సభ్యులు, నాయకులు తదితరులుపాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు